## భూ కొలతల్లో నైపుణ్యానికి పదును

**లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రత్యేక శిక్షణ :విడవలూరు, కోవూరు మండల సర్వేయర్ల ఆధ్వర్యంలో నిర్వహణ**



**విడవలూరు, జూలై 1 ప్రభాతవార్త:** గ్రామాల్లో భూముల కొలతలను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా నిర్వహించి ప్రజలకు నాణ్యమైన సర్వే సేవలు అందించాలనే లక్ష్యంతో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు బుధవారం మండల కేంద్రంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విడవలూరు మండల సర్వేయర్ శ్రీలత, కోవూరు మండల సర్వేయర్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో ఆధునిక సర్వే విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. వ్యవసాయ పొలాల్లో నిర్వహించిన ప్రాక్టికల్ శిక్షణలో అత్యాధునిక సర్వే పరికరాల వినియోగం, భూముల కొలతల విధానం, డిజిటల్ రికార్డుల నమోదు, సరిహద్దుల గుర్తింపు, కొలతల్లో ఖచ్చితత్వం పాటించాల్సిన అంశాలను వివరించారు. సరిహద్దుల గుర్తింపులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా కొలతలను నమోదు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూ వివాదాలను తగ్గించి, ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సర్వే సేవలు అందించడంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్ర కీలకమని అధికారులు పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే సర్వే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా సర్వే సేవల నాణ్యతను మరింత మెరుగుపరచవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇటువంటి శిక్షణలు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి: ప్రసన్నకుమార్‌రెడ్డి



**కొడవలూరు, జూలై 1 ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తిస్థాయి అవగాహనతో పనిచేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు నియోజకవర్గ ఎస్ఐఆర్ పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం వి సి ఆర్ అతిథి గృహం ఆవరణం నందు పార్టీ కార్యాలయంలో బీఎల్ఏలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.గతంలో ఓటు ఉన్నా, ఓటరు గుర్తింపు కార్డు ఉన్నా సరిపోదని, ప్రత్యేక సవరణ ప్రక్రియలో ప్రతి ఓటరు తన వివరాలను నమోదు చేసి ధ్రువీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు చేరకుండా బీఎల్ఏలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అవసరమైతే ఎన్యుమరేషన్ ఫారాల భర్తీలో స్వయంగా సహకరించి, ప్రతి అర్హుడి ఓటు నమోదయ్యేలా చూడాలని కోరారు. ఓటర్ల నమోదు, సవరణల విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వకుండా పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు.వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకుడు వీరి చలపతిరావు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా బీఎల్ఏలు కృషి చేయాలని కోరారు.సమావేశంలో కోవూరు నియోజకవర్గ పరిశీలకుడు కొండూరు అనిల్‌బాబు, ఎంపీపీ గాలి జ్యోతి, మండల పార్టీ అధ్యక్షుడు చిమట శేషగిరి, ఎస్ఐఆర్ కమిటీ సభ్యులు కొట్టే మల్లికార్జున, అనపల్లి ఉదయభాస్కర్, పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## నేడు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే రాక



**కొడవలూరు, జూలై 1 ప్రభాతవార్త:** కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యురాలు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గురువారం కొడవలూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు నార్త్ రాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన తరగతి గదులు, నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు రామన్నపాలెం పంచాయతీలో వికసిత్ భారత్ గ్రామీణ ఉపాధి, జీవనోపాధి హామీ మిషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సం ఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీడీపీ కొడవలూరు మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్ల నాయుడు కోరారు.

## మండల కేంద్రంలో పెన్షన్ల పంపిణీ

**: ఎంపీడీవో నగేష్ కుమారి**



**విడవలూరు, జులై 1 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో నగేష్ కుమారి నిర్వహించారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు నెలవారీ పెన్షన్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో నగేష్ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి నెలా పెన్షన్లను సకాలంలో పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. లబ్ధిదారుల వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేయడం ద్వారా వారికి సమయం ఆదా అవుతుందని, గ్రామ స్థాయిలో సిబ్బంది సమన్వయంతో పారదర్శకంగా పంపిణీ జరుగుతోందని ఆమె వివరించారు.కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఖాదర్ బాషా,మండల పరిధి సిబ్బంది పాల్గొన్నారు.

## కొడవలూరులో 98.5 ఈఎఫ్‌ల పంపిణీ పూర్తి

**:41,244 ఓటర్లలో 40,615 మందికి ఫారాల అందజేత.. డిజిటైజేషన్ 27.13 శాతానికి చేరిక**



**కొడవలూరు, జూలై 1 ప్రభాతవార్త:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా కొడవలూరు మండలంలో ఎన్యూమరేషన్ ఫారాలు (ఈఎఫ్‌లు) పంపిణీ చివరి దశకు చేరుకుంది. మండలంలోని 55 మంది బీఎల్‌వోల పరిధిలో మొత్తం 41,244 మంది ఓటర్లకు పంపిణీ చేయాల్సిన ఫారాల్లో ఇప్పటివరకు 40,615 ఈఎఫ్‌లు పంపిణీ చేసి 98.5 శాతం లక్ష్యాన్ని సాధించారు.మంగళవారం వరకు 40,592 ఫారాలు పంపిణీ చేయగా, బుధవారం మరో 23 ఫారాలు అందజేశారు. ఇప్పటివరకు 11,189 ఈఎఫ్‌లను డిజిటైజ్ చేసి 27.13 శాతం పురోగతి నమోదు చేశారు. గత రోజుతో పోలిస్తే 188 ఫారాలు అదనంగా డిజిటైజ్ అయ్యాయి.సూపర్‌వైజర్ల వారీగా ఆర్. అశ్విన్ పరిధిలో 100 శాతం, పి. రామ్ హరీష్ పరిధిలో 99 శాతం, కె. మస్తాన్‌బాబు పరిధిలో 98.5 శాతం, ఏవీడీ రామప్రసాద్ పరిధిలో 98 శాతం, ఎం. రామగాయత్రి పరిధిలో 97 శాతం ఈఎఫ్‌ల పంపిణీ పూర్తయింది.పంపిణీ, డిజిటైజేషన్ ప్రక్రియను స్థానిక తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు.

## జాతీయస్థాయి హాకీ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించిన మంత్రి "ఆనం"

**- శ్రీకొలను పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి చర్యలు**



**అనుమసముద్రంపేట, జులై1,ప్రభాతవార్త:** ఏఎస్ పేట మండలంలోని శ్రీకొలనులో బుధవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను సందర్శించారు. విద్యార్థులు సాదరంగా ఆహ్వానించగా మంత్రి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈసందర్భంగా పాఠశాల నుంచి జాతీయ స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు ,గ్రామానికి గుర్తింపు తెచ్చిన విద్యార్థులు కె.చెంచులక్ష్మి (అండర్-17 జాతీయ ఎస్‌జిఎఫ్ హాకీ), ఎ.రిషిత, జి.నవ్యశ్రీ (అండర్-14 జాతీయ హాకీ), ఎం.కీర్తన (జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-17 హాకీ)లను మంత్రి ప్రత్యేకంగా అభినందించి వారి ప్రతిభను కొనియాడారు. విద్యార్థులను జాతీయ స్థాయికి తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయుడు థామస్ పీటర్‌తోపాటు ఇతర ఉపాధ్యాయులను ఆయన ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తే వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ఉన్నత విజయాలు సాధిస్తారన్నారు. పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి అవసరమైన ర్పతిపాదనలతో అధికారులు రావాలని ఆదేశించిన మంత్రి విద్యార్థులకు మెరుగైన క్రీడా వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శ్రీకొలను జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో క్రీడా మైదానాన్ని ఆధునీకరించి మినరల్‌వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీరాజ్ , మండల పరిషత్ అధికారులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి ప్రసన్న పరామర్శ



**కోవూరు, జూలై 1 ప్రభాతవార్త :** నెల్లూరుకు చెందిన రమేష్ కుమార్ కుటుంబ సభ్యులను బుధవారం మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ మేరకు ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు, తదితరులు ఉన్నారు.

## శ్రీకొలను గిరిజన కాలనీలో స్వయంగా పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి "ఆనం"



**అనుమసముద్రంపేట, జులై1,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌పథకం కింద లబ్ధిదారులకు రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం ఏఎస్‌పేట మండలంలోని శ్రీకొలను గ్రామ గిరిజన కాలనీలో స్వయంగా ఇంటింటికి వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి వృద్ధులు. వికలాంగులు, వితంతువులు, బ్రాహ్మణులతోపాటు ఇతర పెన్షన్ లబ్ధిదారులను ఆప్యాయంగా పలుకరించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ అవసరమైన సూచనలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రతినెలా 1వ తేదీన పెన్షన్లు నేరుగా లబ్ధిదారుని ఇంటివద్దకే అందించే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు.వృద్ధులు, వికలాంగులు, వితంతువులు అర్హులైన ప్రతి ఒక్కరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీకొలను గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 305 మంది లబ్ధిదారులకు 12.86 లక్షల పెన్షన్లు మొత్తాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 36,354మంది లబ్ధిదారులకు 16.22 కోట్లకు పైగా నెల్లూరు జిల్లాలో 2,87,345 మంది లబ్ధిదారులకు 127.23 కోట్లకు పైగా పెన్షన్ మొత్తాన్ని ప్రభభుత్వం అందజేస్తుందన్నారు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థికసహాయం కోసం దరఖాస్తు చేస్తున్న మూడు కుటుంబాలకు ముఖ్యమంత్రిసహాయ నిధి చెక్కులను మంత్రి రామనారాయణరెడ్డి పంపిణీ చేశారు.ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో గత రెండేళ్ళ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ హయాంలో 876కుటుంబాలకు 8,19,76,563 ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించామని మంత్రి తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకాన్ని పారదర్శకంగా , వేగవంతంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## కావలి 11వ వార్డులో పెన్షన్లు పంపిణీ



**కావలి, జులై 1 ప్రభాతవార్త :** పట్టణంలోని 11వా వార్డులో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సూచనల మేరకు ఏసుపోగు లలితమ్మకి బుధవారం స్పౌజ్ పెన్షన్ పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఇంటింటికి వెళ్లి ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేయడం జరిగింది. నియజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే కావలి ఎమ్మెల్యే లక్ష్యమని నాయకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, నియోజకవర్గ ఎస్‌సిసెల్ అద్యక్షులు దావులూరి దేవకుమార్ క్లోస్టర్ ఇన్‌చార్జ్ వల్లేరి వెంకట కిరణ్‌కుమార్, యూనిట్ ఇన్‌చార్జ్ ఇనగంటి అనీల్‌బాబు, పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్షులు అక్కిలిగుంట సూర్యప్రకాష్, స్వర్ణ సచివాలయ సిబ్బంది, వార్డు నాయకులు పాల్గొన్నారు.

## శానాయపాళెంలో ఘనంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**రాపూరు, జూలై01ప్రభాతవార్త :** మండలంలోని శానాయపాళెం గ్రామంలో బుధవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి,క్లస్టర్ 4 ఇన్‌చార్జ్ తిక్కమనేని ప్రసాద్ నాయుడు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్‌లు ఆందజేశారు.ఈ సందర్భంగా ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పింఛన్‌లను రూ. 4 వేల నుండి 15 వేల వరకు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది వున్నారు.

## సొసైటీలో మెగా వైద్య శిబిరం విజయవంతం



**కోవూరు, జూలై 1 ప్రభాతవార్త :** పడుగుపాడు సహకార సొసైటీ రైతుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని సొసైటీ చైర్మన్ నాగారెడ్డి శ్యామ్ సుందర్‌రెడ్డి అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం సహకార వారోత్సవాలు సందర్భంగా ఎనెల్ హాస్పిటల్ వారి సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో తప్పకుండా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. రైతులు కూడా వీటిని సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఆరోగ్య పరీక్షల్లో భాగంగా రైతుల కోసం ఇటువంటి శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అనంతరం వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు జయప్రకాష్, శ్రీనివాసులు, సొసైటీ ఉద్యోగులు శివ, శ్రీరామ్, మధు, సనత్, తదితరులు ఉన్నారు.

## పాటూరు జడ్పీ పాఠశాలకు ఎస్‌బీఐ క్రీడా పరికరాలు విరాళం




**కోవూరు, జూలై 1 ప్రభాతవార్త :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనివర్శరీ డే పురస్కరించుకుని బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ. 20 వేలు విలువైన క్రీడా పరికరాలను విరాళంగా అందజేశారు. పాఠశాల ఆవరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ మురళి నాయక్ , కోవూరు బ్రాంచ్ మేనేజర్లు పాల్గొని క్రీడా సామగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ సయ్యద్ జుల్ఫికర్ ఆలీ అహ్మద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాల విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు ఈ పరికరాలను అందజేసినట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రయోజనార్థం క్రీడా సామగ్రిని అందించిన ఎస్‌బీఐ యాజమాన్యానికి ప్రధానోపాధ్యాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పీడీ కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు మారెళ్ల చంద్రమోహన్, ఎం. శేషయ్య, ఉమా మహేశ్వరి, వల్లి బాషా పాఠశాల ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది, పాల్గొన్నారు.

## చంద్రప్రభ వాహనంపైన ఆత్మారామస్వామి



**సంగం జులై 1 ప్రభాతవార్త :** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలో శ్రీ సీతాలక్ష్మణ సమేత ఆత్మారామస్వామి వారి బ్రహ్మోత్స వాలలో భాగంగా శ్రీ ఆత్మారామస్వామి వారి చంద్రప్రభ వాహనంపైన భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కీర్తి శేషులు గుండ్రా రఘు రామిరెడ్డి జ్ఞాపకార్థం పెనుబల్లి శివప్రసా ద్‌రెడ్డి వ్యవహారించారు.

## గత సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరం మంచి ఫలితాలు రావాలి డిబిసి డబ్ల్యూ పి.వెంకటలక్ష్మీ




**సంగం జులై 1 ప్రభాతవార్త :** సంగం మండలం అన్నారెడ్డిపాళెం లోని బిసి బాలుర హాస్టల్‌ని రాత్రి జిల్లా బిసి వెల్ఫేర్ అధికారిణి పి.వెంకటలక్ష్మీ ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో చాలా సేపు మాట్లాడారు. కొద్ది సేపు ఉపాధ్యాయురాలుగా మారి బుక్స్ తీసుకొని వారిని అనేక ప్రశ్నలు వేసింది. బాగా చదవాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం బోజనంను పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతుఈ సంవత్సరం బిసి హాస్టల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని, ట్రిపుల్ ఐటిలో సీట్లు కూడా సాధిచండం జరిగిందని అన్నారు. జిల్లా కలక్టర్ కూడా విద్యార్థులను అభినందించారని ఆమె స్పష్టం చేశారు.ఈ విద్యా సంవత్సరంలో రెట్టింపు ఉత్సాహంతో విద్యార్థులందరు ఉత్తమ ఫలితాలు సాదించేందుకు వార్డన్లు ఒక లక్ష్యంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

## రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వం లక్ష్యం



**మొదటి తరువాయి**

**– తీవ్రవాదుల తరహాలో ప్రజల్ని భయపెడుతున్నారు..** పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో పెట్రోలు, డీజిల్ ధరలు కూడా పెరిగాయి. ఈ సమయంలోనే ఇథనాల్ వినియోగించుకుని ఇంధన పొదుపు చేయాల్సి ఉంది. ఇథనాల్ తయారీ కోసం మొక్కజొన్న లాంటి పంటలు అవసరం అవుతాయి. రైతులు ఈ ప్రత్యామ్నాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరిశ్రమల్ని ఆహ్వానించడానికి సమయం పడుతుంది. కానీ తరిమి కొట్టడానికి ఒక్క క్షణం చాలు. గత పాలకులు పరిశ్రమల్ని రాష్ట్రం నుంచి తరిమి కొట్టారు. కర్ణాటకకు వెళ్లిపోవాల్సిన హీరో మోటార్స్ సంస్థను రాష్ట్రానికి తీసుకువచ్చి ఇక్కడ మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేసేలా కృషి చేశాం. కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు కూడా 3వ తేదీన శంకుస్థాపన చేయబోతున్నాం. 2028 నాటికి ఆ రాయలసీమలో స్టీల్ పరిశ్రమ ఉత్పత్తి కూడా ప్రారంభిస్తుంది. నా ప్రయత్నం అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందించటమే. గొడ్డలి పార్టీ తీవ్రవాదుల తరహాలో అందరినీ భయాందోళనలకు గురి చేస్తోంది. రోజుకో ఫేక్ న్యూస్, రోజుకో విన్యాసంతో గొడ్డలి పార్టీ కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోంది. గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చింది. మేం అధికారంలోకి వచ్చాక ఈగల్ టాస్క్ ఫోర్సు ద్వారా నియంత్రించాం. గత పాలకులు ప్రజల్ని బంధించి, భయపెట్టి మరీ సమావేశాలు పెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చాకే ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. రాష్ట్ర ప్రజలందరికీ అవసరమైన రాజధాని అమరావతి గొడ్డలి పార్టీకి అవసరం లేదు. అందుకే ఇంకా రాజధానిపై కుట్రలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పుడు వేగంగా పనులు జరుగుతుంటే సహించలేకపోతున్నారు. గత పాలకుడు తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాలతో రాష్ట్రానికి రాజధానే లేకుండా పోయింది. మూడు రాజధానుల పేరిట గందరగోళ పరిచారు. ఎవరైనా పొరుగు రాష్ట్రాలకు వెళ్తే ఏపీకి మూడు రాజధానులా అని హేళనకు గురయ్యారు. పార్లమెంటులో శాశ్వత రాజధాని చట్టం చేస్తుంటే మావిగన్ అంటూ కొత్త ఆటలు మొదలు పెట్టారు. అమరావతి పరిరక్షణ కోసం అంటూ రౌడీలతో ఇప్పుడు దండయాత్ర చేస్తున్నారు. నిలకడలేని వ్యక్తులు రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్ని ఇబ్బందులు పెడుతున్నారు.

**– హోంమంత్రిపై అవమానకర వ్యాఖ్యలు** విజయవాడలో యువకుడి అదృశ్యం ఘటన నా దృష్టికి వస్తూనే సీఐను సస్పెండ్ చేశాం, చర్యలకు ఆదేశించాం. కానీ వైసీపీ నాయకులు కులాల మధ్య వివాదాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులతో విష ప్రచారం చేస్తున్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లతో ఆ పార్టీ నేతలు రెచ్చిపోతున్నారు. హోం మంత్రి అనిత మేకప్ పై ఆ పార్టీ నేతలు అసహ్యంగా, అవమానకరంగా మాట్లాడారు. మహిళా కమిషన్ ఈ అంశంపై గట్టిగా ప్రశ్నించినా ఆ పార్టీ నేతలు తమ వ్యాఖ్యల్ని సమర్థించుకుంటున్నారు. జగన్ సహకారం లేకపోతే ఆయన వెంట ఉన్న నేతలు విచ్చలవిడిగా మాట్లాడే పరిస్థితి ఉండదు. మా పార్టీలో ఈ తరహా మాట్లాడిన వారిని పార్టీ నుంచి బయటకు పంపించాం. మేం యజ్ఞంలా అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నేతలు రాక్షసుల్లా దానికి ఆటంకం కలిగిస్తున్నారు. నేరాలు చేసే పార్టీ, నేరస్తులను కాపాడే పార్టీ, నేరస్తులతో రాజకీయాలు చేసే పార్టీని ఇప్పుడే చూస్తున్నాం. అర్హత లేని వారిని అందలం ఎక్కిస్తే రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు సమస్యలు వస్తాయి. ఇలాంటి వ్యక్తులను జైల్లో పెట్టాలంటే ఒక్క నిముషం పని కానీ మేం ప్రతీ కార రాజకీయాలు చేయటం లేదు. మా దృష్టి అంతా రాష్ట్రం అభివృద్ధి కావాలని, తెలుగు వారిని అందలం ఎక్కించాలనే. రాష్ట్రంలో రౌడీయిజం చేయాలన్నదే వైసీపీ నేతల ఆలోచన. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అనే సంకల్పం ప్రజలు చేయాలని కోరుతున్నాను. ఎన్డీఏ అగైన్ అండ్ అగైన్ అన్నదే మన నినాదం కావాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుంది. నేరస్తులకు వంతపాడటం, నేరాలు చేయటం రాజకీయ పార్టీలకు తగదు. ఇలాంటి పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**– డ్వాక్రా మహిళలకు అభినందన** అనంతరం ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల మహిళలు ప్రదర్శించిన అధునాతన కుట్టు మిషన్లను సీఎం తిలకించారు. ఆధునిక కుట్టు మిషన్‌తో సీఎం చంద్రబాబు చిత్ర పటాన్ని అప్పటికప్పుడే తయారు చేసిన మహిళలు దానిని ముఖ్యమంత్రికి అందించారు. అరటి నారతో తయారు చేసిన వివిధ ఉత్పత్తులను చూసిన సీఎం డ్వాక్రా సంఘాల మహిళలను అభినందించారు. ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న ఉద్యాన పంటల ఉత్పత్తులు, మత్స్యకార బోట్లకు బిగించే ట్రాన్స్ పాండర్లను సీఎం పరిశీలించారు. అదే విధంగా పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గతంలో అభివృద్ధి సంక్షేమ విషయంలో రెండవ స్థానంలో ఉండేదని ఇప్పుడు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ హిమాన్ శుక్లాను అభినందించడం జరిగింది గూడూరు నియోజకవర్గ అభివృద్ధి బాగుందని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ని అభినందించారు జిల్లాలో పెన్షన్ పంపిణీ విషయంలో 91 శాతం పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. అనంతరం శాఖల వారీగా వారి వారి పనితీరును బట్టి ఎంతవరకు పని చేస్తున్నారో రికార్డు పూర్వకంగా తెలుపుతూ ఇంకా చురుగ్గా పనిచేయాలన్నారు.

**– ఓడూరు గ్రామానికి వరాల జల్లు..** గూడూరు గ్రామపంచాయతీలో సిసి రోడ్డు డ్రైనేజీ వాటర్ పైప్లైన్ పూర్తిస్థాయిలో గ్రామానికి కావాల్సిన అన్ని పనులు త్వరితిగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్‌కి ఎమ్మెల్యేకి ఆదేశాలు జారీ చేయడం జరిగింది జిల్లాలో అక్రమ గంజాయి డ్రగ్స్ పూర్తి స్థాయిలో అరికట్టినందుకు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఏఎస్పి సౌమ్య,డి.ఎస్.పి దీక్షితలను ప్రత్యేకంగా అభినందించారు. ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు రౌడీయిజాలో రాజీ పడకూడదని వారికి ఆదేశాలు ఇచ్చారు.

**– పార్టీ బలోపేతానికి కృషి చేయాలి** తెలుగుదేశం పార్టీ లో నాయకులు కార్యకర్తలు పార్టీ బలోపేతానికి విషయాలని రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పున్నపువారిపాలెం గ్రామంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో గ్రామ స్థాయి నుండి ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త సమిష్టిగా పనిచేసే పార్టీని గెలిపించుకొని ముందుకు పోవాలన్నారు ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సర్పంచిని గెలిపించుకోవాలని అన్నారు. కార్యకర్తలకు నాయకులకు పార్టీ అండదండలు ఉంటాయి అన్నారు. నాయకులు కార్యకర్తలు కలిసి ఫోటో గ్యాలరీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, ఎన్ఎండీ ఫరూఖ్, ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే సునీల్ కుమార్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం చేసిన డాక్టర్ కర్నాటి రోహిత్, డాక్టర్ నాగభార్గవి దంపతులు



**కావలి, జులై 1 ప్రభాతవార్త :** కావలి పట్టణం నివాసులు స్వర్గీయ కర్నాటి అనూరాధ జయంతి సందర్భంగా వారి కుమారుడు, కోడలు కర్నాటి మల్టీ స్పెషాలిటి ఆసుపత్రి వైద్యులు డాకటర్ కర్నాటి రోహిత్, కర్నాటి నాగభార్గవి దంపతులు సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణ పరిసర ప్రాంతమైన బుడంగుంట గిరిజన కాలనీలోని పేదలకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా డాక్టర్ రోహిత్ మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా తన తల్లి స్వర్గీయ అనూరాధ జయతి, డాక్టర్స్ డేను పురష్కరించుకొని సేవాసంస్థలోని పేదలకు అన్నదానం చేయడం జరుగుతోందని తెలిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 10ఏళ్ళుగా ఈ డాక్టర్లు దంపతులు ఇంటిలో ఏ కార్యక్రమానికైనా పేదలకు సేవలు అందిస్తూ ఉన్నారని తెలిపారు. ఇందులో భాగంగానే అనూరాధ జయంతి సందర్భంగా సంయుక్త సేవా సంస్థచే పేదలకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో కర్నాటి అనూరాగ్, వైద్య కర్నాటి ఆనూరాధ వాసుకి, డాక్టర్ పుష్పికలు పాల్గొన్నారు.

## అశ్వ వాహన సేవలో స్వామివారు



**కోవూరు, జూలై 1 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్స వాల్లో భాగంగా బుధవారం అశ్వ వాహన సేవలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బ రామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు.అశ్వ వాహన సేవలో స్వామివారు కోవూరు పురవీధుల్లో ఊరేగుతూభక్తులకు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా పూనూరు నారాయణ జ్ఞాపకార్థం కుమారులు, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారిప్రసాద్,రుత్వికులు మురళిస్వామి, సుబ్బయ్యస్వామి,వంశీస్వామి, శ్రీనివాసస్వామి,భక్తులు ఉన్నారు.

## బిడిసి గ్రంధాలయాన్ని సందర్శించిన జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ శాంతి కుమారి

**మొదటి తరువాయి** మీ అందరి సహకారంతో గ్రామంలో ఉన్నటువంటి బీడీసీ గ్రంథాలయం అభివృద్ధి కోసం మా వంతు కృషి చేస్తామని గ్రామస్తులకు తెలియజేశారు. అనంతరం ముత్తుకూరు మండల కేంద్రంలోని గ్రేడ్ 3గ్రంథాలను సందర్శించి, ఇక్కడ గ్రంథాలయ బిల్డింగ్ కూడా సరిగా లేదని, రీడర్స్ కావాల్సినటువంటి సౌకర్యాలు లేవని అన్ని సౌకర్యాలు కల్పించి ముత్తుకూరు గ్రంధాలయాన్ని అభివృద్ధి చేయడానికి స్థానిక శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ముత్తుకూరు గ్రంధాలయ అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలియజేశారు.

# సీఎం చంద్రబాబు పలగాటి భాస్కర్‌రెడ్డికి అభినందనలు

**కోట,జూలై 1 ప్రభాతవార్త :** కోట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పలగాటి భాస్కర్‌రెడ్డిని సీఎం చంద్రబాబు అభినందించారు. చిల్లకూరు మండలంలోని పున్నపువారిపాళెంలో గ్రామ సమీపంలో పేదలసేవలో ప్రజా వేదికలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నివేదకలను తయారు చేసింది. పార్టీ బలోపేతానికి కోట మండల అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని చంద్రబాబు పేర్కొడనంపై కోట మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు .నియోజకవర్గంలోని పార్టీలోని నాయకులు పనితీరును పై ఆయన నివేదికలను తీసుకున్నారు. మొదటి స్దానంలో చిట్టమూరు మండల తెదేపా అధ్యక్షులు కిషోర్ నాయుడు నిలవగా రెండువ స్దానంలో కోట మండల తెదేపా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి నిలిచారు.

# ఘనంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ



**చేజర్ల, జులై 1, ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లు పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలా సాగింది. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సిబ్బంది పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. మండల కేంద్రమైన చేజర్లలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ తెలుగుదేశం పార్టీ నాయకులు బూదల్ల వీర రాఘవరెడ్డి, రావి లక్ష్మీ నర్సా రెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు సోమవరపు హజరత్ అయ్యా, ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ కార్యక్రమంలో పాల్గొని పెన్షన్లు అందజేశారు. తూర్పు కంభంపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులు నాయుడు, మాజీ సర్పంచ్ కొమ్మి రమేష్ నాయుడు పాల్గొని పెన్షన్లు లబ్దిదారులకు వారి చేతుల మీదుగా అందజేశారు. కొలపనాయుడుపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు అచ్చాల నారాయణరెడ్డి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెరమళ్ళపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తలపనేని జయంతిలు నాయుడు పింఛన్లు పంపిణీలో పాల్గొని పింఛన్లు అందజేశారు. పుల్లనీళ్లపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు కొమ్మి సిద్దులునాయుడు పాల్గొని తన చేతుల మీదుగా పింఛన్లను పంపిణీ చేశారు. మడపల్లి గ్రామంలో ఆత్మకూరు ఏఎంసీ డైరక్టర్ జువిగుంట బుజ్జమ్మ భారత్ మహాసేన అధ్యక్షుడు జువ్విగుంట బాబు, బీజేపీ నాయకుడు కుండా శివారెడ్డి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు సిరాజుద్దీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ పథకం ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అగ్నిమాపక శాఖ పనితీరు ప్రశంసనీయం

– అభినందించిన సీఎం చంద్రబాబు నాయుడు



**నెల్లూరు క్రైం, జూలై 1, ప్రభాతవార్త :** జిల్లా అగ్నిమాపక శాఖ పనితీరుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసల వర్షం కురిపించారు. చిల్లకూరు మండలం, పున్నాపువారిపాళెం గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ, పేదల సేవలో ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, డిఎఫ్ఓ వి.శ్రీనివాస్ రెడ్డి, ఆయన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

**– 100 శాతం సంతృప్తి** ప్రభుత్వం తాజాగా నిర్వహించిన ప్రజా సానుకూల అభిప్రాయ సర్వేలో, నెల్లూరు జిల్లా అగ్నిమాపక శాఖ 100 శాతం సంతృప్తి స్థాయిని సాధించిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. క్లిష్ట సమయాల్లో విపత్తులను ఎదుర్కోవడంలో మరియు ప్రజల ప్రాణ, ఆస్తులను కాపాడటంలో జిల్లా యంత్రాంగం చూపిన అంకితభావం అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వ శాఖలన్నీ ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఈ విషయంలో శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలోని నెల్లూరు ఫైర్ డిపార్ట్‌మెంట్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది అని ఆయన పేర్కొన్నారు. సాంకేతికతతో మరింత వేగవంతమైన సేవలు ప్రజా సేవలో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని అగ్నిమాపక శాఖను ముఖ్యమంత్రి ఆదేశించారు.

**– బాధ్యత పెరిగింది: డిఎఫ్ఓ వి.శ్రీనివాస్ రెడ్డి** ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి వి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రశంసలు తమ బాధ్యతను మరింత పెంచాయని పేర్కొన్నారు. ఈ విజయం కేవలం నా ఒక్కడిది కాదు, జిల్లాలోని ప్రతి అగ్నిమాపక సిబ్బంది సమిష్టి కృషికి దక్కిన గుర్తింపు. ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలిచే విషయంలో ఎటువంటి రాజీ పడకుండా ముందుకెళ్తాం అని ఆయన పునరుద్ఘాటించారు.

# ఎరువుల దుకాణ డీలర్లతో సమీక్ష



**పొదలకూరు, జూలై 1, ప్రభాతవార్త :** పొదలకూరు మండల పరిధిలోని ఎరువులు దుకాణం డీలర్లకు పొదలకూర్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శివనాయక్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజనుకు సంబంధించి అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉండాలి, అదే విధంగా ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పి ధరకు మాత్రమే ఎరువులు విక్రయాలు చైయాలి.అదేవిదంగా ఎరువులు భౌతిక స్టాక్స్, రిజిస్టర్స్, డిబిటి ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా సక్రమంగా ఉండే విదంగా ప్రతినిత్యం చూసుకోవాలన్నారు. ఎపి ఎయిమ్స్ 2.0 ద్వారా మాత్రమే ఎరువులు అమ్మకాలు చైయాలి అని దుకాణ దారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్, పొదలకూరు ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

# ఎస్బిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వింజమూరు, జూలై 1, ప్రభాతవార్త :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం వేడుకలను స్థానిక వింజమూరు ఏడిబి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఎస్బిఐ చీఫ్ మేనేజర్ చంద్ర ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పలువురు ఖాతాదా రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా దుతూ ఎస్బిఐ వినియోగదారులకు అనేక పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. అలాగే గతంలో ఇంపీరియల్ బ్యాంకుగా ఉన్న దానిని 1955 జులైలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ మార్పు చేశారని అప్పటినుండి ఎస్బిఐ బ్యాంకు శాకోపశాఖలుగా విస్తరిస్తూ వినియోగదారుల నుండి డిపాజిట్లు సేకరించి వినియోగదారులకు రుణాలుగా అందిస్తుందని తెలిపారు ఈ బ్యాంకు వినియోగదారుల సంక్షేమం కోసం అనేక పాలసీలను ప్రవేశపెట్టిందన్నారు. ఎస్బిఐ ప్రవేశపెట్టిన వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ సంవత్సరానికి 500 రూపాయలు చెల్లించినట్లయితే 10 లక్షల రూపాయల బీమా వర్తిస్తుందని అలాగే 1000, 2000, 3000 చెల్లించినట్లయితే 20, 30, 40 లక్షల బీమా వర్తిస్తుందని ఆయన తెలిపారు. అందువల్ల వినియోగదారులు ఈ పాలసీలు తెలుసుకొని సద్వినియోగ పరుచుకున్నట్లయితే కుటుంబం సుఖమయంగా ఉంటుందని తెలిపారు. బ్యాంకు అందించే నూతనమైన పథకాలను తెలుసుకుంటూ వాటిని సద్వినియోగపరుచుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ షబ్బీర్, సర్వీస్ మేనేజర్ ఓం ప్రకాష్, అసిస్టెంట్ మేనేజర్ శివ శంకర్, సిబ్బంది, ఖాతాదారులు తదితరులు ఉన్నారు.

# చివరి అంకానికి సర్



**కోట, జూలై 1 ప్రభాతవార్త :** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో గత నెల 15వ తేదీ నుంచి చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. కోట మండలంలో 42,452 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 40,349 ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఓలు అందజేశారు. 10,755 ఎన్యూమరేషన్ ఫారాలను (26 శాతం) డిజిటలైజేషన్ చేశారు. జూలై 14వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. స్వగ్రామాల్లో ఓటు ఉండి, ఉద్యోగ, ఉపాధి రీత్యా ఇతర ప్రాంతాల్లో తాత్కాలికంగా నివాసం ఉండే వారు సంబంధిత బిఎల్ఓను సంప్రదించాలని అధికారులు ఇప్పటికే సూచనలిచ్చారు. ప్రస్తుతం ఇంటి వద్దకే పత్రాలు అందజేశారు. వాటిని పూర్తి చేసి తిరిగి బిఎల్ఓలకు అందజేయాలి. ప్రతి ఓటరు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఏదో ఒక గుర్తింపు కార్డును ఫారంతో జత చేయాలి. 2002 ఓటరు జాబితాను పరిగణనలోకి తీసుకుని బిఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను ధ్రువీకరిస్తున్నారు. అప్పటి జాబితాలతో ప్రస్తుత ఓటరు జాబితాను పోల్చిచూసి ఒకే కుటుంబంలో ఉన్న వారందరినీ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి తీసుకొచ్చేలా మ్యాపింగ్ ప్రక్రియను ఇప్పటికే చేపట్టారు. వీటి ఆధారంగా తాజాగా సర్ కొనసాగింపు జరుగుతుంది. ప్రస్తుతం ఉన్న జాబితాలను అనుసరించి ప్రతి ఓటరు వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను ఎన్నికల సంఘం ముద్రించింది. ఈసీ నిబంధనల మేరకు ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 1200 ఓటర్లకు లోపే ఉండాలి. కొన్నిచోట్ల ఎక్కువమంది ఓటర్లు ఉండటంతో రాత్రి 10 గంటలకు కూడా పోలింగ్ జరుగుతున్న సందర్భాలు ఉన్నాయి. ఈ మేరకు రేషనలైజేషన్‌లో భాగంగా 1200 మందికి పైగా ఓటర్లు ఉన్న కేంద్రాలను కూడా అధికారులు గుర్తించే దిశలో ఉన్నారు.

# పారదర్శకంగా పెన్షన్ పంపిణీ



**వింజమూరు, జూలై 1, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగాఅందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం ఉదయం 6 గంటల నుండి వింజమూరు పట్టణంలో ప్రారంభించడం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసులు రెడ్డి, మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి మాట్లాడుతూ సిద్దార్థ నగర్ ప్రాంతంలో అర్హులైన పెన్షన్ దారులకు పెన్షన్ పంపిణీ చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పెన్షన్ పంపిణీ కార్యక్రమం దిగ్విజయంగా ఒకటవ తేదీ నూరు శాతం అర్హులకు అందించడంలో అధికారుల పాత్ర గొప్పదని ఆయన కొనియాడారు. ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి కూటమి నాయకుల సారథ్యంలో పంపిణీ జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వనిపెంట హైమావతి, డిప్యూటీ ఎంపీడీఓ రామారావు, వీఆర్వో, పరిశుద్ధ రావు గ్రామస్తులు ఎన్నపల్లి పెంచలరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ కుమారుడికి అత్యధిక ర్యాంక్



**ఆత్మకూరు, జులై1,ప్రభాతవార్త:** ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం చేజర్ల కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కనిగంటి శ్రీనివాసులు కుమారుడు కనిగంటి రేవతేంద్రవర్మకు బుధవారం ప్రకటించిన ఎంసెట్ ఇంజనీరింగ్‌లో 85.77 మార్కులతో 2001 ర్యాంకుతో సీటు సాధించారు. ఎంతోకష్టపడి చదివి తమ కుమారుడు ఈర్యాంకు తో సీటు సాధించడంపై రేవతేంద్రవర్మ తండ్రి శ్రీనివాసులు, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

# ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు వచ్చేశాయ్

**కోట,జూలై 1 ప్రభాతవార్త :** ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తోన్నఈ ఫలితాలు ఏపీ విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. దీంతో అర్హత సాధించిన విద్యార్థులు సంబరాలు చేసుకుంటున్నారు. ఏ కళాశాలలో ఏంత ఫీజు ఉంటుంది .. ప్లేస్‌మెంట్ ఎలా ఉంటాయి అనే కోణంలో వివిధ కళాశాల నుంచి సమాచారం సేకరించి పనిలో బిజ్జారు. ఇప్పటికే వారు ఒక నిర్ణయంకు వచ్చినట్లు పలువురు విద్యార్థులు తెలిపారు.ఆప్షన్లు కు ప్రభుత్వం తేదీ ఎప్పుడో ఇస్తుందానని వారు ఆరా తీస్తున్నారు.కాల్విపై అయిన పలువురు విద్యార్థులు బుధవారం విద్యానగర్‌లో స్వీట్లు పంచుకున్నారు.

# విద్యుత్ శాఖలో కొలువులు కొట్టేయండి

– 135 ఏఇఇ పోస్టులకు దరఖాస్తులు

**కోట, జూలై 1 ప్రభాతవార్త :** విద్యుత్ శాఖలో కొలువుల మేళా మోగింది. చాలాకాలం తర్వాత అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఇఇ) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది. ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలో 135 ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ డిస్కం పరిధిలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు ఉన్నాయి. జూన్ 30 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. జూలై 20వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు.పోస్టులు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్ పోస్టులు) 125, సివిల్ విభాగంలో 6, టెలికాం విభాగంలో 4 పోస్టులు ఉన్నాయి. జనరల్ విభాగంలో 57, బీసీ 37, ఎస్సీ 20, ఎస్టీ 8, ఈడబ్ల్యూఎస్‌లకు 12, ఓసీ ఉమన్ 1 పోస్టు కేటాయించారు.విద్యార్హతలు యూజీసీ అనుమతి పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లేదా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ)లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఏఇఇ (టెలికాం)టెలి కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చేసిన వారు అర్హులు.ఏఇఇ (సివిల్) సివిల్ ఇంజనీరింగ్ చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. 18 నుంచి 42 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 47 ఏళ్లు దాటకూడదు. దివ్యాంగులకు 52 ఏళ్ల వరకు అవకాశం ఇచ్చారు.పరీక్ష ఇలా.అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 22 నుంచి 29వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 47 పరీక్ష కేంద్రాలను గుర్తించారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాల్లో 5 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. కోర్ సబ్జెక్ట్ నుంచి 70 మార్కులు, జనరల్ ఇంటలిజెన్స్ అండ్ రీజనింగ్ (5), జనరల్ అవేర్‌నెస్ (7), ఇంగ్లీష్ లాంగ్వేజ్ (5), క్వాంటిట్యూ ఆప్టిట్యూడ్ (8), కంప్యూటర్ పరిజ్ఞానం (5) అంశాలకు కలిపి 30 మార్కులు కేటాయించారు. బీసీలకు 35, ఓసీ, ఈడబ్లూఎస్‌కు 40, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 30 మార్కులు అర్హతగా నిర్ణయించారు.

# ఘనంగా కిమ్స్ హాస్పిటల్‌లో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు



**నెల్లూరు, జూలై 1, ప్రభాతవార్త – వైద్యం :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ హాస్పిటల్, నెల్లూరులో వైద్యులకు ఘనంగా సన్మానం చేసి వేడుకలు నిర్వహించారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం జూలై 1న ప్రముఖ వైద్యుడు డా. బిధాన్ చంద్ర రాయ్ జయంతి, వర్ధంతిని పురస్కరించుకుని జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వైద్యుల సేవలను స్మరించుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ ప్రాణాలను కాపాడటంలో వైద్యుల సేవలు అమూల్యమైనవని, రోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం వారు వైద్య వృత్తిలో తమ స్వంత జీవితాన్ని, కుటుంబ సమయాన్ని మరియు చిన్న చిన్న సంతోషాలని కూడా త్యాగం చేస్తూ అన్ని వేళలా పేషేంట్లకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో నిరంతర సేవలందిస్తున్నారని కొనియాడారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితులలో కూడా ప్రాణాలను సహితం లెక్క చేయకుండా ఎంతో మంది ప్రాణాలను కాపాడి దేశానికీ మరువలేని సేవ చేసినటువంటి వైద్యుల సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుని కొనియాడారు. ఈ కార్యక్రమానికి అతిధిగా విచ్చేసిన ప్రముఖ రచయిత్రి నెల్లూరు ఇందిర డాక్టర్స్ డే సందర్భంగా ఒక యదార్ధ సంఘటన గురించి తెలియచేసి చీఫ్ కార్డియాలజిస్ట్ అండ్ హెచ్‌ఓడి కార్డియాలజి డాక్టర్ సి ఎస్ శ్రీనివాస రాజు, ఈ ఎన్ టి సర్జన్ డాక్టర్ ఎస్ రాజేష్ కుమార్ ఇతర వైద్యుల యొక్క అత్యున్నతమైన సేవలను చాలా గొప్పగా కొనియాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాల వైద్యులను పుష్పగుచ్చాలు, శాలువాలతో సత్కరించి వారి సేవలను అభినందించారు. అనంతరం కేక్ కట్ చేసి వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సింగ్ సిబ్బంది నృత్య ప్రదర్శనలను ప్రదర్శించి వైద్యులను తమ యొక్క దైనందిన పని ఒత్తిడి నుండి కొద్ది సమయంపాటు ఉపసమనం కలిగించి సంతోషపరిచారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కార్డియాలజిస్ట్ అండ్ హెచ్‌ఓడి కార్డియాలజి డాక్టర్ సి ఎస్ శ్రీనివాస రాజు, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఎస్ జానకిరామ్, హెచ్‌ఓడి చీఫ్ అనస్థీషియాలజిస్ట్ డాక్టర్. శేషయ్య, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కే. బాలకొండయ్య, సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్ సి హెచ్ సురేష్ కుమార్ రెడ్డి, ఈ ఎన్ టి సర్జన్ డాక్టర్ ఎస్ రాజేష్ కుమార్, హెచ్‌ఓడి ఇంటెన్సివిస్ట్ డాక్టర్ వి జగదీష్, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్. నరేష్ కుమార్, పాథాలజిస్ట్ డాక్టర్ బి ప్రసాద్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ డి సాహెబ్ పీర్, జనరల్ సర్జన్ డాక్టర్ జగదీష్, సీనియర్ మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ దీప్తి, సీనియర్ డెంటిస్ట్ డాక్టర్ ఎస్ శ్రీనివాసులు, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్. సి. కృష్ణమోహన్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్. జి. సంఘమిత్ర, పల్మనాలజిస్ట్ డాక్టర్ సి శశి భరత్ కుమార్ రెడ్డి, ఇంటెన్సివిస్ట్ డాక్టర్. కె. విన్నీ సుకాంత్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్. వి. అభినయ రెడ్డి, కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ పి లోకేశ్వర రావు, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఏ సన్నెస్ రెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి రాజేంద్ర ప్రసాద్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్. మోహన సాయి రూప, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్. టి. కావ్య మిత్ర, నియోనాటాలజిస్ట్ డాక్టర్.ఆర్ భార్గవ్, పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్.ఆర్ మురార్జీ, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్. బి. పల్లవి, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్. బి. వన్య, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్. రేఖ రెడ్డి, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్. మంజూష, హెచ్‌ఓడి ఎమర్జెన్సీ డాక్టర్ వి శివ రామ కృష్ణ రెడ్డి, నియోనాటాలజిస్ట్ డాక్టర్. ఎం వెంకట్ నవీన్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్. బి.వి. సాయి భరత్, యూరాలజిస్ట్ డాక్టర్. జి రాకేష్ వంశి, ఎండోక్రైన్ సర్జన్ డాక్టర్. బి సాహితి ప్రియ, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్. కె వరుణ్ ప్రకాష్, బయో కెమిస్ట్ డాక్టర్, షేక్ కలీముల్లాహ్, మెడికల్ కోఆర్డినేటర్ డాక్టర్. శ్రీధర్ రెడ్డి, యూనిట్ హెడ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి ప్రియ లక్ష్మి, డాక్టర్. ప్రవీణ్ కుమార్ వంచి, రీజినల్ సి.ఓ.ఓ, నర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చి రూరల్ బ్యాంకులో ఉచిత వైద్యశిబిరం



**బుచ్చి జూలై 1 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం రూరల్ బ్యాంకులో ( బుచ్చిరెడ్డిపాళెం కో ఆపరేటివ్ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ)సహకార వారోత్స వాలలో భాగంగా చైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి నేతృత్వంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.వి కృష్ణారెడ్డి(మమత నర్సింగ్‌హోమ్) వైద్యప రీక్షలు నిర్వహించారు . భాగంగా డాక్టర్ జివి కృష్ణారెడ్డిని ఘనంగా సన్మాని ంచారు. ఈకార్యక్రమంలో డైరక్టర్లు కోనం కృష్ణయ్య, మాచవరం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా టిడిపి అధ్యక్షుడు బీద రవిచంద్ర అధ్యక్షతన నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం

**మొదటి తరువాయి** స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నద్ధత బూత్ స్థాయి సమన్వయాన్ని బలోపేతం చేయడం, స్థానిక సంస్థాగత లోపాలను గుర్తించడం, సమర్థులైన స్థానిక నాయకత్వాన్ని ఎంపిక చేయడం, ఎన్నికల సన్నద్ధతను మెరుగుపరచడం, క్యాడర్ సమీకరణను మెరుగుపరచడం వంటి అంశాలు గురించి చర్చించారు. పార్లమెంట్ కార్యవర్గ సభ్యులను మండల పరిశీలకులుగా నియమించుట గురించి, గ్రామ, మండల, నియోజకవర్గ అనుబంధ విభాగాల పటిష్టత గురించిరాష్ట్ర పార్టీ ఆదేశం మేరకు మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, పార్లమెంట్ అధ్యక్షులు నియోజకవర్గ పర్యటనలు, సమీక్షల గురించి చర్చించారు. యూనిట్,మండలం, నియోజకవర్గం, పార్లమెంట్ పార్టీ క్యాలెండర్ సమావేశాల గురించి వారు చర్చించారు.

# ఇక అక్రమాలకు కళ్లెం

– ఇంటి పన్ను చెల్లించే వారి ఫోన్లకు పంచాయతీ సమాచారం

**కోట, జూలై 1 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీల ఆదాయం, వ్యయాలు ప్రజలకు తెలిసేలా పారదర్శక పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పంచాయతీలకు సంబంధించిన ఖర్చు, నిల్వ ఉన్న నిధుల వివరాలను ఇంటి పన్నులు క్రమంగా చెల్లించే యజమానుల ఫోన్లకు సమాచారం అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఇది జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటివరకు పంచాయతీల్లో ఏమి జరుగుతుందో చాలామందికి తెలియదు. కొంతమంది సిబ్బంది పన్నులు వసూలు చేసి సొంతానికి వాడుకునేవారు. గుర్తించినప్పుడే ప్రభుత్వానికి జమ చేసేవారు. చాలా పంచాయతీల్లో ఇదే పరిస్థితి కొనసాగింది. ఉన్నతాధికారుల తనిఖీలు జరిగినప్పుడు ఇవి వెలుగు చూసేవి. ఒక వేళ పాలకవర్గాలు ఉన్నా వారికి ఇటువంటి విషయాలు తెలిసేది తక్కువే. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పంచాయతీల సమాచారం పౌరులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. దీనికి సంబంధించిన ప్రక్రియ వేగవంతం చేసేలా చర్యలు చేపట్టారు. పన్నులు చెల్లించే ప్రతి వ్యక్తికి మూడు నెలలకోసారి పంచాయతీలకు ఎంత ఆదాయం వచ్చింది. దేనికి ఖర్చు చేశారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి గురించి చరవాణిలకు పంపుతారు.

# బిజెపిని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యం



**కావలి, జూలై 1 ప్రభాతవార్త :** భారతీయ జనతా పారీటని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యమని కావలి ఒకటవ పట్టణ అధ్యక్షులు మందకిరణ్‌కుమార్ తెలిపారు. మంద కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం, ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యఓఉలు మంద కిరణ్ కుమార్ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్తాయికి తీసుకెళ్ళేందుకు, ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిటన్లు తెలిపారు. ప్రజలు సమస్యలునేరుగా తెలుసుకొని వారి పరిష్కారానికి కృషి చేయడం కోసం ప్రతి సోమవారం జనతావారధిని విస్తృతంగా నిర్వహించనున్నామని తెలిపిఆరు. ప్రధానమంత్రి మన కీబాత్ కార్యక్రమాలను ప్రతి డివిజన్, వార్డు స్థాయిల్లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షుతులై నూతన చేరికలను ప్రోత్సహించడంతో పాటు బూత్‌స్తాయిలో కమిటీలను బలోపేతం చేసేందుకు ఎస్ఐఆర్, బిఎల్ఏ2 ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి సారించనున్నామని తెలిపారు. దేశభక్తుడు మహనీయుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఈనెల 6న పట్టణ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సన్నగంటి సీనయ్య జిల్లా కోశాధికారి సివిసి సత్యం, జీఎస్‌టి మండలి సభ్యులు అమరా వెంకటసుబ్బారావు, ఎస్‌సి మోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పరుసు వెంకటేశ్వర్లు, బీజెవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిక్రిష్ణ, ఎస్‌సి మోర్చా జిల్లా కార్యదర్శి మంద శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బెజవాడ దశరదరామిరెడ్డి వర్ధంతి



**బుచ్చి జులై 1 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రభుత్వ వైద్యశాలలో సీనియర్ నాయకులు బెజవాడ దశరధరామిరెడ్డి మరియు, బెజవాడ ఓబుల్‌రెడ్డి కుమారుడు బెజవాడ మహేష్ చంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దొడ్ల కోదండరామిరెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. వైద్యశాలకు వచ్చిన వారందరికి మజ్జిగ పంపిణి చేశారు. దొడ్ల కోదండరామిరెడ్డి మాటా్లడుతు బెజవాడ దశరదరామిరెడ్డి అంటే బుచ్చిరెడ్డిపాళెం ప్రాంతంలో తెలియని వారు వుండరని అన్నారు.మంచి తనానికి నిలువెత్తు రూపం అని కొనియాడారు.ఈకార్యక్రమంలో సుమన్, మీరాబాయి తదితరులున్నారు.

# మాజీ జడ్‌పిటిసి గంగపట్నం చంద్రశేఖరయ్య మృతి



**సంగం జూలై 1 ప్రభాతవార్త :** సంగం మండలం జంగాల కండ్రిక గ్రామానికి చెందిన మాజీ జడ్‌పిటిసి గంగపట్నం చంద్రశేఖరయ్య బుధవారం మృతి చెందారు.గత కొంతకాలంగా ఆయన ఆనారోగ్యంతో బాధపడుతు మృతి చెందారు. మండల రాజకీయాలలో తన కంటు ఒక పేజిని ఏర్పాటు చేసుకున్న రాజకీయనేత చంద్రశేఖరయ్య, జిల్లాలో ఉన్న అన్ని పార్టీల శాసనసభ్యులకు చంద్రశేఖరయ్య ఎంతో అను బంధం ఉండేది. అందరు " శేఖరన్న " అంటు సంబోధించేవారు. ఆయన మృతి విషయం తెలిసి పలువురు దగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

# ఘనంగా వనజీవి రామయ్య జయంతి వేడుకలు



**కావలి, జూలై 1 ప్రభాతవార్త :** కావలి పెద్దపవని రోడ్డులోని వైకుంఠపురం సెంటర్‌లో ఏపి కుమ్మర యువసేన నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ పర్యావరణ పనరిరక్షకుడు, సామాజిక కార్యకర్త వనజీవి పద్మశ్రీ దరిపల్లి రామయ్య 89వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాజీ కౌన్సిలర్ మన్నేపల్లి లక్ష్మినరసయ్య మాట్లాడూ వనజీవి దరపల్లి రామయ్య పర్యావరణ పరిరక్షణకు ఐదు దశాబ్దాలకు పైగా చెట్లు పెంపక ఉద్యమాన్ని కొనసాగించి రహదారులు పాఠశాలలు, ప్రభుత్వ భూములు తదితర ప్రాంతాల్లో లక్షలాది మొక్కలు నాటారు. నియోజకవర్గ కుమ్మర యువసే ఇన్‌చార్జ్ బెజవాడ అభిసాగర్ ప్రజాపతి మాట్లాడుతూ వనజీవి రామయ్య పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేసినందుకుగానూ ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారంతో సత్కరించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కుమ్మరిసంఘం అధ్యక్షులు యొగురి పెద్దపుల్లయ్య, అద్దంకి ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ గుదూలరి మాల్యాద్రి, ఏగూరి చిన్న పుల్లయ్య పులి రజని, చక్రపాణి దంపతులు వెంటకేశ్వర్లు సాయిలు, పొన్నగంటి మురళి, నిజాంపట్నం రఘుపతి, పట్నం రవి, మల్లిరమణ, ఏగురి పుల్లయ్య, జెజవాడ మనోజ్, మన్నేపల్లి తిరుపాలు, పత్తిపాటి రఘు, దిలీప్ మల్లికార్జున, న్యాయవాదులు గుంజి నరేష్, గుర్రంకొండ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్‌జీ వేతనాల పెంపు



**కోట,జులై 1 ప్రభాతవార్త :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్దానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ చట్టం నేటి నుంచి అమల్లోకి వచ్చింది. ఉపాధి హామీ పథకంలో 100 రోజులగా ఉన్న పనిదినాలను 125 రోజులగా పెంచుతూ తీసుకొచ్చిన ఈ చట్టం కింద చెల్లించే వేతనాలను కేంద్ర తాజాగా నోటిపై చేసింది. రోజువారీ వేతనాన్ని కనిష్టంగా రూ 300 నుంచి రూ 409 చెలింంచేల్లా నిర్ణయించింది.దీంతో ఉపాధి కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సర్ ప్రోగ్రామ్ ద్వారా అందరికి మేలు జరుగుతుంది



**బుచ్చి జులై 1 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం అర్బన్‌లో భారతీయ జనతాపార్టీ అర్బన్ అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్‌కుమార్ ఆద్వర్యంలో రామకృష్ణాగర్ బేల్దారిపాళెం ఏరియా ప్రజలకు సర్ గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోస్తా ఆంధ్రజోన్ సర్ ఇంచార్జి మేకల హనుమంతరావు,ప్రకాశం జిల్లా ఇంచారజ్జ గుండ్లపల్లి భరతకుమార్ బిఎల్ఎ2లతో సర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా అతిధులు మాట్లాడుతు సర్ అనే కార్యక్రమం ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేకుండా ఎలక్షన్ కమీషనర్ యొక్క పరిధిలో జరుగుతుందని చెప్పారు. దీని వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు నిలబడుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు కాసా శ్రీనివాసులు, రామిశెట్టిమోహన్‌బాబు, పోలిశెట్టి వెంకట సుబ్బారావు, కొడవలూరు నాయకులు మోర్కొండ శివకుమార్, కిసాన్ మోర్చ నాయకులు మహేషనాయుడు, జడపల్లి రమణమ్మ, గోళ్ళ నరసింహులు, మహిమలూరు ప్రవీణ్‌కుమార్, గోలి సురేంద్ర, తానా మణికంఠ, చెంగలపట్టు ప్రశాంత్, ఉకోటి శశికుమార్, మునికుమార్, బొర్రు రామచంద్రయ్య, కోణం శ్రీనివాసులు, మచ్చ కోటేశ్వరరావు, బిజెపినాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెన్షన్లు పంపిణి చేసిన పుట్టా దంపతులు



**బుచ్చి జులై 1 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని విలియమ్స్‌పేట (కొట్టాలు)గ్రామంలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పంపిణి చేసినట్లు జొన్నవాడ దేవస్థానంమాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి పెన్షన్ అందజేసినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని వారు కొనియాడారు.ఈకార్యక్రమంలో మాజీ ఉపాధ్యాక్షులు సందాని బాషా, నీటి సంఘం డైరక్టర్ ఎస్‌కె హామిద్బాషా, పిడుగు వేణు, ఎస్‌కె షేక్ ,సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

## గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలిపిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

### గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు హయాంలోనే బలమైన పునాది ఎమ్మెల్యే



**చిల్లకూరు, జులై 1, ప్రభాతవార్త:** గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి సిఎం చంద్రబాబు హయాంలోనే బలమైన పునాదని గూడూరు శాసన సభ్యులు పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పున్నపు వారిపాలెంలో నిర్వహించిన పేదల సేవలో ప్రజా వేదిక కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో విలీనం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం గూడూరును తిరుపతి జిల్లాలో చేర్చగా, ప్రజల మనోభావాలను గౌరవించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలిపారని పేర్కొన్నారు. పున్నపు వారిపాలెం రహదారిని ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే రహదారి నిర్మాణానికి అవసరమైన అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయడంలో ప్రత్యేక చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేశారు. పున్నపువారిపాలెం ప్రాంతంలో పరిశ్రమలు అధికంగా ఉన్నాయని, రహదారి నిర్మాణం అనంతరం భూముల విలువలు గణనీయంగా పెరిగాయని పేర్కొన్నారు. గూడూరు నియోజకవర్గంలో జరిగిన ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు నాయుడు హయాంలోనే బలమైన పునాది పడిందన్నారు. మిగిలిన రహదారుల నిర్మాణం, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధి, గూడూరు ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయడం, చిట్టమూరు ప్రాంత తాగునీటి సమస్య పరిష్కారం తదితర అంశాలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు.

## అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతికి నెల్లూరు జిల్లా కేంద్రబిందువుగా మారుతోంది: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**చిల్లకూరు, జులై 1, ప్రభాతవార్త** అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతికి నెల్లూరు జిల్లా కేంద్రబిందువుగా మారుతోందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పున్నపువారి కండ్రిగలో నిర్వహించిన పేదల సేవలో ప్రజా వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతికి మారుపేరుగా నిలిచిన గూడూరు నియోజకవర్గానికి ముఖ్యమంత్రి విచ్చేయడం జిల్లా ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. గూడూరు, కోట, చిల్లకూరు, ముత్తుకూరు మండలాల్లో 27 మెగా పరిశ్రమల ద్వారా రూ.27,988 కోట్ల పెట్టుబడులు ఆకర్షించబడగా, 19,819 మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు. ఇది జిల్లాలో వేగంగా జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధికి నిదర్శనమన్నారు. కృష్ణపట్నం పోర్టు అంతర్జాతీయ వాణిజ్యానికి, కొత్త పెట్టుబడుల ఆకర్షణకు ప్రధాన కేంద్రంగా నిలుస్తోందని పేర్కొన్నారు. భారతదేశంలోని రెండు ప్రధాన మెగా ఫర్నిచర్ పార్కుల్లో ఒకటి మన నెల్లూరు జిల్లాలో రూ.3,500 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానుండటం గర్వకారణమన్నారు. ఈ మెగా ఫర్నిచర్ క్లస్టర్‌లో 400 నుంచి 550 తయారీ యూనిట్లు ఏర్పడి, కృష్ణపట్నం పోర్టు అనుసంధానంతో వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయని వివరించారు. ప్రతి నెల పేదల సేవలో ప్రజా వేదిక కార్యక్రమం ద్వారా స్వయంగా లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు అందజేస్తూ సంక్షేమ పాలనకు కొత్త నిర్వచనం ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నెల్లూరు జిల్లా మరింత ప్రగతి సాధిస్తుందనే పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రికి జిల్లా ప్రజల తరఫున మరోసారి ధన్యవాదాలు తెలియజేశారు.

## వీపీఆర్ నేత్ర సేవలు నిరుపమానం





**కోవూరు, జులై 1 ప్రభాతవార్త :** వీపీఆర్ ఫౌండేషన్ అధినేత పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ప్రత్యేకంగా చొరవ తీసుకుని వీపీఆర్ నేత్ర సేవలు ఏర్పాటు చేయడం అమోఘమని మాజీ నీటి సంఘం అధ్యక్షుడు వెంకయ్య అన్నారు. కోవూరు మండలం జమ్మిపాలెం గ్రామంలో బుధవారం వీపీఆర్ నేత్ర సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా మారుమూల ప్రాంతాల్లో సైతం ఇటువంటి వైద్య శిబిరం నిర్వహించి వారికి అవసరమైన కంటి అద్దాలు , ఆపరేషన్ వంటివి ఏర్పాటు చేయడం ఇతరులకు స్ఫూర్తిదాయకం అన్నారు. ఇటువంటి సామాజిక సేవలు అందిస్తున్న వీపీఆర్ దంపతులు నెల్లూరు జిల్లాకు దొరకడం ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. కంటి అద్దాలు పంపిణీ చేశారు. శిబిరంలోని వృద్ధులకు పింఛన్లు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సునీల్‌రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, పురుషోత్తం, పెంచలయ్య, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు దాతల ప్రోత్సాహం దొరకడం అదృష్టం



**కోవూరు, జులై 1 ప్రభాతవార్త :** విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని , బాగా చదివితేనే సమాజంలో మంచి గుర్తింపు , ఉన్నతమైన జీవితం లభిస్తుందని డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కీర్తిశేషులు మద్దు వెంకురెడ్డి, కమలమ్మల జ్ఞాపకార్థం వారి కు టుంబ సభ్యులు, పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన 2025-26 విద్యా సంవత్సర పదవ తరగతి ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో ఇలాంటి ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించే వారు ఎవరూ లేరని, ప్రస్తుత విద్యార్థులకు ఇలాంటి నగదు పురస్కారాలు అందిస్తూ ప్రోత్సహించే దాతలు ఉండడం ఈ పాఠశాల అదృష్టమని కొనియాడారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సజ్జా గౌతమి(560) రూ. 50 వేలు, పర్రి వెంకట మాధవి(553) రూ. 20 వేలు, వన్నం మధులేఖకు(490) రూ. 10 వేలు నగదు పురస్కారాలను డిప్యూటీ డీఈవోతో పాటు దాతల కుటుంబ సభ్యులు సుధాకర్‌బాబు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేసి అభినందించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని దాతలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు షేక్. మహ్మద్ రహీమ్, చెంచులక్ష్మమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జుల్ఫికర్ ఆలీ అహ్మద్, దాతలు సుధాకర్‌బాబు, పాటూరు నీటి సంఘం అధ్యక్షుడు ఆదాల శివారెడ్డి, ఉపాధ్యాయులు మారెళ్ల చంద్రమోహన్, ఎం. శేషయ్య, మన్ని ఉమా మహేశ్వరి, సత్తార్ బేగం, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేష్, పాఠశాల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## డాక్టర్ ప్రభాకర్‌నాయుడుని సత్కరించిన ప్రసాద్‌రెడ్డి



కావలి, జులై 1 ప్రభాతవార్త :జాతీయ వై ద్యుల దినోత్సవం సందర్భంగా పట్టణా నికి చెందిన ప్రజా వైద్యులు, మాజీ ము న్సిపల్ ఛైర్మెన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ నా యుడుని ప్రముఖ కాంట్రాక్టర్ నోటి ప్ర సాద్‌రెడ్డి, మిత్రబృందం బుధవారం శా లువాలు,పూలమాలలతో సత్కరించి డాక్ట ర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. ప్రసాద్‌రెడ్డి, లోక్‌సత్తా మాలకొం డారెడ్డిలు మాట్లాడుతూ భారతరత్నం డా క్టర్ బిసి రాయ్ జయంతిని పురస్కరిం చుకొని వైద్యుల దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలో వైద్యరంగంలో రాణిస్తూ ఉచిత కార్పోరేట్ వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి పేద ప్రజ లకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు. జీవితాంతం వైద్యవృత్తికే అంకితభావంతో సేవలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. బీసీ రామ్‌కి సరైన వారసుడు డాక్టర్ ప్రభాకర్‌నాయుడు అన్నారు. వైద్యరంగంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని ఆయన సేవలను కొనియాడారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతి



**నెల్లూరు,జులై1 ప్రభాతవార్త-విద్య** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర వైద్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ ను రాష్ట్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి వినతి పత్రం సమర్పించారు. అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పుర స్కరించుకుని పొద్దుటూరులో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణ, రాష్ట్ర జనరల్ కార్యదర్శి చేజర్ల సుధాకర్‌రావు లు మంత్రిని కలిసి ఈ మేరకు వవరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు హెల్త్ ఎడ్యుకేటర్స్ పేరును డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారిగా మార్చటం సంతోషదాయకమన్నారు. డిప్యూటీ హెల్త్ అధికారులుగా 20,25 సంవత్సరాలు పనిచేసి ఉద్యోగోన్నతి రాకుండానే పదవీ విరమణ చేయాల్సి వస్తుందన్నారు. పదోన్నతులు కల్పించాలని కోరారు. వికసిత్ భారత్, ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యాలుగా ప్రజలకు చేరువ చేసేందుకు, తాము ఎంతగానో శ్రమిస్తున్నామన్నారు. తమ సమస్యలను సానుకూలంగా విన్న మంత్రి పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంటేరు శ్రీనివాసులురెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జయప్రకాష్, జిల్లా అధ్యక్షులు మల్లయ్య, నాయకుఉలు మల్లిఖార్జున, వెంకటేశ్వర్లు, శోభారాణి, ఉషారాణి, శ్రీదేవి, విజయభారతి, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వవ్వేరు బ్యాంకు నూతన సిఇఒగా తుమ్మల నరసయ్య



**బుచ్చి జులై 1 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెంలోని వవ్వేరు రూరల్ బ్యాంకు సిఇ ఒగా ( మేనేజర్‌గా) తుమ్మల నరసయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గ తంలో సిఇఒగా ఉన్న మన్నారపు శ్రీనివాసులు పదవి కాలం పూర్తి కావడంతో నరస య్యను మేనేజర్‌గా కోవూరు శాసనసభ్యు రాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో నియమించడం జరిగిందని బ్యాంకు ఛైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ తెలిపారు.ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బ్యాంకు ప్రతిష్ట కాపాడాలని నరసయ్యకు సూచించారు. బ్యాంకు డైరక్టర్లు ఎం.మాల్యాద్రి,కోవూరు పద్మమ్మ, సీనియర్ నాయకులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, పలువురు నరసయ్యకు అభినందనలు తెలిపారు.

## సిఎం నారాచంద్రబాబునాయుడుని కలిసిన షుగర్ రైతులు

### సిఎంకి సమస్యను వివరించిన ఆనం ప్రసాద్‌రెడ్డి



**నంగం జులై 1 ప్రభాతవార్త** సూదలగుంట షుగర్ ఫ్యాక్టరీ యాజ మాన్యం తమకు చెల్లించాల్సిన చెరకు బకాయిలను వెంటనే ఇప్పించి న్యాయం చేయాలని కోరుతు ఉమ్మడి నెల్లూరు ,చితూరు, తిరుపతి,కడప జిల్లాలకు చెందిన చెరుకు రైతుల సంఘం నాయకులు ఆనం ప్రసాద్‌రెడ్డి, పులివర్తి మురళీ మోహన్, కాటంరెడ్డి శివకోటారెడ్డి ,పావులూరి మాల్యాద్రినాయుడు, ఇందుపూరు జనార్ధన్‌రెడ్డిలు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రైతుల ప్రతినిధులు మాట్లాడుతు 2018-19 క్రషింగ్ సీజనల్‌లో సూదలగుంట షుగర్ ప్యాక్టరీ యూనిట్ -1 యూనిట్-2లకు సుమారు 27 వందల మంది రైతులు చెరుకు సరఫరా చేశారని వందలమంది కూలీలు చెరకు కోత పనులు నిర్వహించారని తెలి పారు.అయితే రైతులు కూలీలకు కలిపి 27 కోట్లు మేర బకాయిలు చెల్లించాల్సి ఉన్నప్పటికి ప్యాక్టరీ యా జమాన్యం ఇప్పటి వరకు చెల్లింపులు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లింపుల కోసం పలు మార్లు యాజమాన్యాన్ని సంప్రదించినా స్పందించలేదని పోలీసుల ద్వారా ఒత్తిడి తీసుకొచ్చి వేదింపులకు గురి చేశారని ఆనం ప్రసాద్‌రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లారు. గత ఎనిమిదేళ్ళుగా విధుల్లో ఉన్న అసిస్టెంట్ కేన్ కమీషనర్ యాజమాన్యంతో కుమ్మకై రైతులకు అన్యాయం చేశారని ప్యాక్టరీలోని చక్కెర నిల్వల విక్రయానికి కూడా సహకరించారని ఆరోపించారు. బాధిత రైతులు. కూలీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని అవసరమైతే ప్యాక్టరీ యాజమాన్యానికి చెందిన ఈదూరు భూములను ఆర్ఆర్ చట్టం కింద వేలం వేసి గాని ప్యాక్టరీ స్కాప్‌ను విక్రయించి గానీ బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. వినతిని స్వీకరించన ముఖ్యమంత్రి చంద్రబా బు నాయుడు సమస్యను పరిశీలించి బాధిత రైతులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చినట్లు రైతులు ప్రతినిదులు తెలిపారు.

## మాశిలామణి వైద్యశాలలో ఘనంగా డాక్టర్స్ డే దినోత్సవం



**వింజమూరు, జులై 1, ప్రభాతవార్త** వింజమూరు పట్టణంలోని డాక్టర్ మాశిలామణి వైద్యశాలలో జాతీయ డాక్టర్స్ డే దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వింజమూరు పట్టణంలో నిస్వార్ధంగా సేవలు అందిస్తున్న డాక్టర్ మాశిలామణి అని పలువురు ఆయన సేవలను కొనియాడి ఘనంగసత్కరించి అభినందించారు.



ఈ సందర్భంగా డాక్టర్ మాశిలామణి మా ట్లాడుతూ జాతీయ డాక్టర్స్‌డే అనేది సమాజానికి వైద్యులు అందిస్తున్న అమూల్యమైన సేవలను గుర్తించి వారికి కృతజ్ఞతలు తెలిపే ప్రత్యేక రోజుగా భావిస్తారన్నారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం జులై 1వ తేదీన నిర్వహిస్తారు. ప్రముఖ వైద్యుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జయంతి, వర్ధంతి రెండు జులై 1న కావడంతో ఆయన స్మారకార్థం ఈ రోజును డాక్టర్స డేగా జరుపుకుంటున్నారు. ప్రాణాలను కాపాడేందుకు అంకితభావంతో సేవలందిస్తున్న వైద్యులకు ఈ రోజు దేశం కృతజ్ఞతలు తెలియజేస్తుందనీ, ప్రాణాలను కాపాడే వైద్యులకు కృతజ్ఞతలు తెలిపే ప్రత్యేక రోజు అని కొనియాడారు. పలువురు నాయకులు డాక్టర్ మా శిలామణి గొప్పతనం గురించి వివరించారు. రోగుల ఆరోగ్యమే లక్ష్యంగా పగలు, రాత్రి తేడా లేకుండా సేవ లందిస్తున్న వైద్యుల అంకితభావానికి జోహార్ అని పేర్కొన్నారు. మాశిలమనీ అర్ధరాత్రి సమయంలోనైనా బాధితుడు వచ్చినట్లయితే ఎలాంటి విసుగు కానీ చిరాకు గాని లేకుండా ఎంతో ఆప్యాయంగా వచ్చి ఆ రోగికి చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని ఆయన ఈ ప్రాంత వాసులకు ఒక బంధువుగా ఒక ప్రాణదాతగా అందరి హృదయాలలో స్థానాన్ని సంపాదించారని అందుకే ఆయనంటే ఈ ప్రాంత వాసులకే కాకుండా ఇతర జిల్లాల వాసులకు కూడా ఆయన ఎంతో సుపరిచితుడుగా గుర్తింపు పొందారన్నారు. కేవలం వైద్య సేవలో కాకుండా సేవా కార్యక్రమాలలో కూడా ముందుండే వారిని పేదలంటే దయాగుణం కలిగిన వాడిని పేర్కొన్నారు. ఈ డాక్టర్ ప్రశాంత్ నిర్మలా మాశిలామని, హాస్పటల్ సీఈవో హెప్సిబా, మల్లికార్జున, కీర్తన, ప్రేమ లీల, సుజిత్, తిరుమలేశు, కీర్తి, శాంతి, బీజేపీ నేతలు మాధవరావు, రమేష్, మధు, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, కోటేశ్వర రావు, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు



**నెల్లూరు,జులై1 ప్రభాతవార్త-విద్య** అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం డాక్టర్ బిసి.రవి ఫస్ట్‌ఎయిడ్ ప్రొవైడర్స్ సోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఇందులో భాగంగా ఉచిత రక్తదాన, నేత్ర దాన శిబిరాను నిర్వహించారు. పేదలకు ఉచితంగా నేత ప్రరీక్షలుగావించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.సు మంత్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు మోమెంటొలను అందించి సత్కరిచారు.ఈ సందర్భంగా ఆయన మాటాడుతు ఆపదలో ఉన్నవారిని ముందుగా కాపాడేది ఫస్ట్ ఎయిడ్ ప్రొవైడర్ ఏ నని తెలిపారు. రక్తదానం చేయటం అంటే ప్రాణదానం చేయటమే నని అందరూ విధిగా రక్త దానం చేయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో మల్లికార్జున, నవీన్‌రెడ్డి, గ్రామీణ వైద్యులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు

### ఈ నెల 3 నుండి 6 వరకు జిల్లాలో పర్యటన: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, జులై 1, ప్రభాతవార్త - కలెక్టరేట్** భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ఈ నెల 3వ తేదీ నుండి 6వ తేదీ వరకు ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై 3వ తేదీ (శుక్రవారం) ఉదయం 6.15 గంటలకు తిరుపతిలోని కోర్ట్‌యార్డ్ బై మారియట్ హోటల్ నుండి బయలుదేరి, ఉదయం 8.15 గంటలకు వెంకటాచలం మండలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో బస చేస్తారని పేర్కొన్నారు. జులై 4వ తేదీ (శనివారం) వెంకటాచలం మండలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లోనే బస చేయనున్నారని తెలిపారు. జులై 5వ తేదీ (ఆదివారం) సాయంత్రం 5.00 గంటలకు నెల్లూరులోని వి.పి.ఆర్. కన్వెన్షన్ సెంటర్, గొలగమూడి రోడ్డులో నిర్వహించే పుస్తక పరిచయం కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమం అనంతరం వెంకటాచలం మండలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారని పేర్కొన్నారు. జులై 6వ తేదీ (సోమవారం) ఉదయం 5.40 గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్ నుండి బయలుదేరి, ఉదయం 7.10 గంటలకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుండి ఉదయం 7.55 గంటలకు ఇండిగో విమానంలో బయలుదేరి, ఉదయం 9.00 గంటలకు హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## ఎప్‌సెట్ ఫలితాల్లో సత్తాచాటిన నారాయణ విద్యార్థులు



**నెల్లూరు,జులై1 ప్రభాతవార్త-విద్య** బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎప్‌సెట్ ఫలితాల్లో నగరం లోని స్థానిక నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచి సత్తాచాటారు. ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రా స్థాయిలో 5వ ర్యాంకును కైవశం చేసుకన్నారు. అగ్రికల్చర్ విభాగంలో 42వ స్థానం సాధించారు. నగరంలోని నారాయణ మెడికల్ అకాడమీవిద్యార్థులు శ్రీ వల్లి 42 వ ర్యాంకు, పి.శ్రీజ 63వ ర్యాంకు,ఎన్ .నందిని హర్ష 91 వ ర్యాంకు, ఏ అద్వితి కార్తికేయ 98వ ర్యాంకులు కైవశం చేసుకున్నా రు.ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సాధిన కళాశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల కోర్‌డీన్ జయకుమార్ రాయుడు, ఏజీఎం మధుసూదన్‌రెడ్డిలు ర్యాంకర్లకు పుష్పగుచ్చాలు అందించి అభి నందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో తమ విద్యార్దులు ఉత్తమ ఫలితాలు సాధించటం సంతోషంగా ఉందన్నారు. ఈ ఫలితాల్లో 100లోపు నలుగురు విద్యార్దులు, 500లోపు 28మంది, వెయ్యిలోపు 264మంది, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించటం జరిగిందన్నారు. నగరానికి చెందిన ఐఐటి అకాడమీ విద్యార్దులు కుశాల్‌రెడ్డి 90వ ర్యాంకు, సాయి లిఖిత్111, పి.లక్షయ వశిష్ట 131, లక్ష్మీతేజ158, వి.శివకుశవంత్179, మధుకర్ జస్వంత్360, సాయి కిరణ్374 సాధించటం జరిగిందన్నారు. తమ విద్యాసంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన పటిష్ట అకడమిక్ ప్రోగ్రామ్ ద్వారా ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ నాయుడుకి ఘన సత్కారం



**కావలి, జులై 1 ప్రభాతవార్త :** కావలి ముసునూరులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) భవనంలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ప్రజా వైద్యులు, కావలి మాజీ మున్సిపల్ ఛైర్మెన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడు చేతుల మీదుగా కేకులు కట్ చేయించి మెమొంటో అందజేసి శాలువాలో పూలమలలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం పలువురు వైద్యులు ఆయన ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. నా జీవితం ప్రజాసేవకే అంకితం అని పేద ప్రజలకు తమ వంతు సాయం ఎల్లవేలలా చేయడం జరుగుతుందనితెలిపారు. వైద్య వృత్తిలో ఫీజులు ముఖ్యం కాదని వైద్యం చేయడం ముఖ్యమన్నారు. డబ్బులు కూడా పొదుపు చేసు కోవాలని అలా పొదుపు చేసుకోలేనందున నాకు సొంత ఇళ్లు కూడా లేదనాన్నరు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ డాక్టర్లు వారి కుటుంబ సబ్యులు పాల్గొన్నారు.



## ఎప్‌సెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్దుల ప్రతిభ



**నెల్లూరు,జులై1 ప్రభాతవార్త-విద్య** బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎప్‌సెట్ 2026 ఫలితాల్లో నగరంలోని స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్దులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచి సత్తా చాటారు. ఎర్రంరెడ్డి సాహితి 525వ ర్యాంకు, చలువాది వెంకట సుభా ష్ చంద్ర 840వ ర్యాంకు, షేక్.అర్మాన్ సయ్యద్1542, కే.తేజ నరసింహ చౌదరి2547, ఎస్‌కే మహమ్మద్ ఇమాన్3305 ర్యాంకులు సాధించారు. స్థానిక కళాశాలలో విద్యార్దులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీచైతన్య జూనియర్ కళాశాలల ఏజిఎం జి.శ్రీరాం ఈ సందర్భంగా మా ట్లాడుతు తమ విద్యార్దులు రాష్ట్రస్థాయిలో 1 వ స్థానంతోపాటూ ఉత్తమ ర్యాంకులు సాధించటం సంతో షంగా ఉందన్నారు. నెల్లూరు క్యాంపస్ నుండి 3వేల లోపు 6మంది, 5వేల లోపు 14మంది, 10వేల లోపు 22మంది, 20వేల లోపు 54మంది విద్యార్దులు ర్యాంకులు సాధించటం జరిగిందన్నారు. భవిష్యత్‌లో వీరు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. అనంతరం ర్యాంకర్లకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సిబ్బంది , అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా దేవాదాయశాఖ పనితీరు భేష్



**నెల్లూరు,జులై1 ప్రభాతవార్త-విద్య** జిల్లాలో దేవాదాయశాఖ పనితీరు ప్రశంసనీయంగా ఉందని, జిల్లా దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి ఉత్తమంగా విధులు నిర్వహించటం మిగిలిన అధికారులకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. జిల్లాలో దేవాదాయశాఖ పనితీరు 0.83శాతం అభివృద్ధి చెందిందన్నారు. గత ప్రభుత్వంలో దేవాలయాలపై జరిగిన దాడులను గుర్తుచేస్తూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోని రాగానే దేవాలయాల అభివృద్ధికి పెద్ద పీఠ వేశామన్నారు. 2025, 2026లో ప్రజలు ఎక్కువశాతం దేవాలయాలకు వచ్చి సంతోషంగా వెల్లారాని, జిల్లాలో కూడా వృద్దిరేటు సంతోషర స్థాయిలో ఉందన్నారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని ఇతర జిల్లాల అధికారులుకూడా ఉత్తమంగా విధులు నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు.

## కొనసాగుతున్న జనసేన నిర్మాణసారధుల సమాచార సేకరణ



**నెల్లూరు,జులై1 ప్రభాతవార్త-విద్య** జిల్లా జనసేన పార్టీలో నూతన కమిటీలను ఏర్పాటుచేయటంలో భాగంగా నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు, నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్న ఆశావాహుల నుండి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం బుధవారం రెండవ రోజు కొనసాగింది. ఇల్లా నలుమూలల నుండి జనసేన పార్టీకి చెందిన ఆశావాహులు పార్టీలో వివిధ స్థానాల కోసం వారి వారి వినతులను ఎమ్మెల్యే నాయకర్‌కు అందజేశారు. ఇప్పటి వరకు వారు పార్టీ కోసం ఏమి చేశారు. ప్రస్తుతం వారు పార్టీలో ఏ స్థానం కోరుకుంటున్నారు. తదిరత అంశాలను ఆయా దరఖాస్తుల్లో పరిశీలకులకు అందజేస్తున్నారు. బుధవారం నెల్లూరు నగరం, రూరల్ ప్రాంతాలతోపాటూ ఇతర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని వారి దరఖాస్తులను అందజేశారు.

## సీఎం చంద్రబాబుకు ఘనంగా వీడ్కోలు

**చిల్లకూరు, జులై 1, ప్రభాతవార్త** పేదల సేవలో ప్రజా వేదిక కార్యక్రమం అనంతరం పున్నపువారి పాలెం సమీపంలోని హెలీపాడ్‌కు బుధవారం సాయంత్రం 5.46 గంటలకు చేరుకున్న సీఎం హెలీకాప్టర్‌లో తిరుపతి జిల్లా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. సీఎంకు కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.